# కరెంట్ అఫైర్స్

1. ఇటీవల మహారాష్ట్రలోని రైతులు తమ డిమాండ్ల సాధన కోసం ఎంత దూరం పాటు 'మహాపాదయాత్ర' చేసి వార్తల్లో నిలిచారు? (2018, మార్చి 6న నాసిక్ నుంచి ప్రారంభమైన ఈ 'మహాపాదయాత్ర' మార్చి 12న ముంబయిలో ముగిసింది. సుమారు 50 వేల మంది రైతులు ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. సంపూర్ణంగా పంట రుణాలు, విద్యుత్ బిల్లుల మాఫీ, వడగళ్ల వాన, కీటకాల దాడుల్లో దెబ్బతిన్న పంటలకు పరిహారం, అటవీ భూములపై హక్కులు, స్వామినాథన్ కమిటీ సిఫారసుల అమలు తదితర డిమాండ్లతో సీపీఎం అనుబంధ 'అఖిల భారత కిసాన్ సభ – ఏఐకేఎస్' ఆధ్వర్యంలో రైతులు ఈ మహాపాదయాత్ర నిర్వహించారు. మహారాష్ట్ర ప్రభుత్వం వీరి డిమాండ్లకు అంగీకరించిన నేపథ్యంలో నిరసనలను విరమిస్తున్నట్లు రైతులు ప్రకటించారు.)

ఎ) 100 కి.మీ. బి) 140 కి.మీ. సి) 180 కి.మీ. డి) 220 కి.మీ.

2. తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి (రైసస) తొలి ఛైర్మన్‌గా 2018, మార్చి 12న హైదరాబాద్‌లో ఎవరు బాధ్యతలు స్వీకరించారు? (ఈయన 1995 నుంచి 1999 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాడి ఉత్పత్తిదారుల అభివృద్ధి సమాఖ్య ఛైర్మన్‌గా వ్యవహరించారు. 1998లో జాతీయ పాడి ఉత్పత్తిదారుల అభివృద్ధి మండలి సంచాలకులుగా పనిచేశారు.)

ఎ) అజ్మీరా సీతారాంనాయక్ బి) గుత్తా సుఖేందర్‌రెడ్డి

సి) పసునూరి దయాకర్ డి) కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

3. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'రాఖీ సోదరి' శర్బతాదేవి (104) ఇటీవల ఎక్కడ మరణించారు? (ప్రధాని మోదీకి శర్బతా రాఖీ కట్టాలని కోరుకుంటున్నట్లు గత ఏడాది ఆమె కుమారుడు ప్రధాని కార్యాలయానికి లేఖ రాశారు. దీంతో గత రాఖీ పండుగ రోజున ఆమెను తన నివాసానికి ఆహ్వానించి ప్రధాని మోదీ రాఖీ కట్టించుకున్నారు.)

ఎ) ధన్‌బాద్ బి) వారణాసి

సి) అహ్మదాబాద్ డి) లఖ్‌నవూ

4. మరణం వాయిదా వేయడం మినహా మరే ఆశ లేనప్పుడు, శారీరక బాధను భరించలేని దయనీయ పరిస్థితిలో రోగి లేదా అతడు/ఆమె తరపున నమ్మకమైన వ్యక్తి అనుమతితో కారుణ్య మరణం ప్రసాదించవచ్చని పేర్కొంటూ పరోక్ష కారుణ్య మరణానికి (పాసివ్ యుథనేసియా) సమ్మతిస్తూ సుప్రీంకోర్టు ఏ రోజున కీలక తీర్పును వెలువరించింది? (సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. 'కామన్ కాజ్' అనే స్వచ్ఛంద సంస్థ 2005లో దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై విచారణ జరిపిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. నిజానికి పరోక్ష కారుణ్య మరణాన్ని అనుమతిస్తున్నట్లు 2011, మార్చి 11న అరుణా షాన్‌బాగ్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.)

ఎ) 2018, మార్చి 9 బి) 2018, మార్చి 10

సి) 2018, మార్చి 11 డి) 2018, మార్చి 12

5. 2018, మార్చి 9న అమృత్‌సర్‌లో మరణించిన ప్యారేలాల్ వడాలీ (75) ఏ రంగానికి చెందిన వ్యక్తి?

ఎ) ఖలిస్తాన్ ఉద్యమకారుడు బి) పంజాబీ దర్శకుడు

సి) సూఫీ గాయకుడు డి) రాజకీయవేత్త

6. ఏ రాష్ట్రం కోసం రూపొందించిన ప్రత్యేక ముువ్వన్నెల జెండాను ఇటీవల ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆవిష్కరించారు? (పసుపు, తెలుపు, ఎరుపు రంగులతో కూడిన జెండా మధ్యలో ప్రభుత్వ లాంఛనాన్ని ముద్రించారు. ఇదివరకటి ఈ రాష్ట్ర బావుటాలో ఎరుపు, పసుపు రంగులు మాత్రమే ఉండేవి. కొత్తగా తెలుపు చేర్చారు. దేశంలో తమ రాష్ట్రానికే ప్రత్యేక బావుటా ఉన్నట్లు సీఎం పేర్కొన్నారు).

ఎ) తమిళనాడు బి) కర్ణాటక సి) కేరళ డి) గోవా

7. 'వింగ్స్ ఇండియా 2018' పేరిట పౌర విమానయాన ఏరోస్పేస్ ప్రదర్శనను 2018 మార్చిలో ఎక్కడ నిర్వహించారు?

ఎ) విశాఖపట్నం బి) బెంగళూరు సి) చెన్నై డి) హైదరాబాద్

**8.** మయన్మార్ నేత ఆంగ్‌సాన్ సూకీకి ఇచ్చిన మానవ హక్కుల అవార్డును వెనక్కి తీసుకుంటున్నట్లు ఏ దేశానికి చెందిన హోలోకాస్ట్ స్మారక మ్యూజియం ప్రకటించింది? (రోహింగ్యా ముస్లింలపై సైనిక చర్యలను, వారిని దేశం నుంచి ఖాళీ చేయించేందుకు చేపడుతున్న ప్రక్రియను నిలువరించేందుకు ఈమె ఏమీ చేయలేకపోయిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది.)

ఎ) అమెరికా బి) బ్రిటన్ సి) ఫ్రాన్స్ డి) రష్యా

**9.** విదేశీ మహిళలు విధులు నిర్వర్తించేందుకు ఇష్టపడే ఆసియా దేశాల్లో భారత్ ఎన్నో స్థానంలో నిలిచినట్లు హెచ్ఎస్‌బీసీ సర్వేలో వెల్లడైంది? (ఈ జాబితాలో తొలి మూడు స్థానాల్లో సింగపూర్, హాంకాంగ్, దక్షిణ కొరియా నిలిచాయి.)

ఎ) 4 బి) 5 సి) 6 డి) 7

**10.** దేవధర్ ట్రోఫీ – 2018 విజేత? (హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో జరిగిన ఫైనల్లో 6 వికెట్ల తేడాతో విజయ్ హజారే ట్రోఫీ – 2018 విజేత కర్ణాటకను ఈ జట్టు ఓడించింది. ఈ జట్టు కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ వ్యవహరించారు.)

ఎ) భారత్ – బి బి) భారత్ – ఎ సి) భారత్ – బ్లూ డి) భారత్ – రెడ్

**11.** అమెరికా నౌకాదళానికి చెందిన విమాన వాహక నౌక 'యూఎస్ఎస్ కార్ల్ విన్సన్' 2018 మార్చిలో ఏ దేశంలోని తీర నగరమైన డనాంగ్‌కు చేరుకుంది? (1975 తర్వాత అమెరికాకు చెందిన భారీ యుద్ధ నౌక ఇక్కడికి రావడం ఇదే మొదటిసారి. దక్షిణ చైనా సముద్రంలో చైనా విస్తరణవాదాన్ని కట్టడి చేసేందుకు అమెరికా, ఈ దేశం కలిసి చేపడుతున్న చర్యలకు ఇది ఊతమిస్తుందని భావిస్తున్నారు.)

ఎ) థాయ్‌లాండ్ బి) వియత్నాం సి) జపాన్ డి) ఫిలిప్పీన్స్

**12.** అంతర్జాతీయ ఉక్కు దిగ్గజం ఆర్సెలర్ మిత్తల్ అధ్యక్షుడిగా ఎవరు నియమితులయ్యారు? (ఈయన ప్రస్తుతం ఆర్సెలర్ మిత్తల్ యూరప్ విభాగానికి సీఎఫ్‌వో, సీఈవోగా వ్యవహరిస్తున్నారు. ఈయన ఆర్సెలర్ మిత్తల్ ఛైర్మన్, సీఈఓ లక్ష్మీనివాస్ మిత్తల్‌కు కుమారుడు.)

ఎ) వినీత్ మిత్తల్ బి) సుదీప్ మిత్తల్ సి) ఆదిత్య మిత్తల్ డి) కిరణ్ మిత్తల్

**13.** దక్షిణ మధ్య రైల్వే పరిధిలో తొలి మహిళా రైల్వే స్టేషన్‌గా ఏది గుర్తింపు పొందింది? (అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8 నుంచి రైల్వే స్టేషన్‌లో కార్యకలాపాల నిర్వహణను మొత్తం మహిళలకే అప్పగించారు.)

ఎ) చంద్రగిరి రైల్వేస్టేషన్ (చిత్తూరు జిల్లా), గుంతకల్ డివిజన్

బి) బేగంపేట రైల్వేస్టేషన్ (హైదారాబాద్ జిల్లా), సికింద్రాబాద్ డివిజన్

సి) ఫిరంగిపురం రైల్వేస్టేషన్ (గుంటూరు జిల్లా), గుంటూరు డివిజన్

డి) పై మూడూ

**జవాబులు**

**1–సి; 2–బి; 3–ఎ; 4–ఎ; 5–సి; 6–బి; 7–డి; 8–ఎ; 9–డి; 10–ఎ; 11–బి; 12–సి; 13–డి.**

## స్టీఫెన్ హాకింగ్ మరణం

★ కృష్ణబిలాలు, విశ్వం పుట్టుక, విస్తరణ, అంతంపై మన్నికైన సూత్రాలతో సైద్ధాంతిక భౌతికశాస్త్రంలో వెలుగులు నింపిన విశ్వవిఖ్యాత భౌతిక శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ (76) బ్రిటన్‌లోని కేంబ్రిడ్జ్‌లో ఉన్న తన స్వగృహంలో 2018, మార్చి 14న మరణించారు.

★ 1942, జనవరి 8న ఇంగ్లండ్‌లోని ఆక్స్‌ఫర్డ్‌లో జన్మించిన హాకింగ్ 21 ఏళ్ల వయసులోనే అమైట్రోఫిక్ లేటరల్ స్క్లెరోసిస్ (ఎఎల్ఎస్) అనే నాడీక్షీణత వ్యాధి బారినపడ్డారు. లోవ్ గెహ్రిగ్స్ వ్యాధిగా కూడా పిలిచే ఈ రుగ్మత వల్ల సాధారణంగా కొన్నేళ్లలోనే మరణం సంభవిస్తుంది. కానీ హాకింగ్ 55 ఏళ్లపాటు జీవించారు. అయితే శరీరమంతా చచ్చుబడి చక్రాల కుర్చీకే పరిమితమయ్యారు.

★ 1988లో హాకింగ్ ప్రచురించిన 'ఎ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్'తో ఆయన తారాపథానికి చేరారు. ఏకబిగిన 237 వారాలపాటు 'ద సండే టైమ్స్ బెస్ట్ సెల్లర్స్' జాబితాలో చోటు దక్కించుకోవడం ద్వారా అది గిన్నిస్ రికార్డుల్లోకి చేరింది. కోటికి పైగా ప్రతులు అమ్ముడు పోయాయి.

★ బ్రిటిష్ పౌరుడైనప్పటికీ హాకింగ్ అమెరికా అత్యున్నత పౌర పురస్కారమైన 'ప్రెసిడెంట్స్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్'ను 2009లో నాటి అధ్యక్షుడు బరాక్ ఒబామా నుంచి అందుకున్నారు. ఇంకా ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ పురస్కారం, విలియం హాప్కిన్స్ పురస్కారం, ఉల్ఫ్‌ప్రైజ్, రాయల్ ఆస్ట్రనామికల్ సొసైటీ పురస్కారం, బ్రిటానికా విశిష్ట పురస్కారం మొదలైనవి గెలుచుకున్నారు.

★ 'ఎ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్'తో పాటు 'బ్లాక్ హోల్స్ అండ్ బేబీ యూనివర్సెస్', 'మై బ్రీఫ్ హిస్టరీ', 'ది గ్రాండ్ డిజైన్', 'ద యూనివర్స్ ఇన్ ఏ నట్‌షెల్', 'జార్జ్స్ సీక్రెట్ కీ టు యూనివర్స్', 'జార్జ్ అండ్ ది బిగ్ బ్యాంగ్' తదితర పుస్తకాలు రచించారు.

★ ఈ విఖ్యాత శాస్త్రవేత్తకు నోబెల్ పురస్కారం మాత్రం దక్కలేదు. ఈయన ప్రతిపాదించిన కృష్ణబిలాల సిద్ధాంతం కచ్చితంగా అద్వితీయమైనదే అయినా దీన్ని ధ్రువీకరించడం లేదా పరిశీలించడం సాధ్యం కాని పని. స్టీఫెన్ ప్రతిపాదనను అందరూ అంగీకరిస్తున్నప్పటికీ దీన్ని రుజువు చేసే విధానం అందుబాటులో లేనందువల్లే నోబెల్ లభించలేదని విశ్లేషకులు భావిస్తున్నారు.

## చైనాలో సూపర్ పవర్‌గా షి జిన్‌పింగ్

★ చైనాలో దేశాధ్యక్షుడి రెండు విడతల పదవీకాలంపై ఉన్న పరిమితిని ఎత్తివేస్తూ చారిత్రాత్మక రాజ్యాంగ సవరణకు ఆ దేశ పార్లమెంట్ 2018, మార్చి 11న ఆమోదం తెలిపింది.

★ దీంతో ప్రస్తుత అధ్యక్షుడు షి జిన్‌పింగ్ జీవితకాలం పాటు పదవిలో కొనసాగడానికి మార్గం సుగమమైంది. పార్టీ వ్యవస్థాపక ఛైర్మన్ మావో జెడాంగ్ తర్వాత జీవితకాలం పాటు అధికారంలో కొనసాగనున్న రెండో నేతగా షి జిన్‌పింగ్ గుర్తింపు పొందారు.

★ ప్రస్తుత చైనా అధ్యక్షుడు విడతకు అయిదేళ్ల చొప్పున రెండు విడతలు మాత్రమే అధికారంలో కొనసాగే వీలుంది. మావో పాలన తర్వాత మరో జీవితకాల నియంతృత్వం తలెత్తకుండా ఉండేందుకు 1982లో చైనా నాయకుడు డెంగ్ జియావోపింగ్ ఈ పరిమితిని తెచ్చారు. తాజాగా దానికి కాలం చెల్లింది.

★ అధ్యక్షుడితో పాటు ఉపాధ్యక్షుడి పదవీకాలంపై ఉన్న పరిమితిని ఎత్తివేసే ప్రతిపాదనపై చైనా పార్లమెంట్ 'నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్' (ఎన్‌పీసీ) లాంఛనంగా ఆమోదముద్ర వేసింది.

## తెలంగాణ బడ్జెట్ 2018-19

✣ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అయిదో భారీ బడ్జెట్‌ను 2018, మార్చి 15న ప్రవేశపెట్టింది. రైతుల సంక్షేమం, వారి అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా 2018 – 19 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. శాసనమండలిలో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

✣ 2018 – 19 వార్షిక బడ్జెట్ మొత్తం రూ. 1,74,453.84 కోట్లు.

✣ రెవెన్యూ వ్యయం రూ. 1,25,454 కోట్లు. రాష్ట్ర ఆదాయం రూ. 73,751 కోట్లు. కేంద్రం నుంచి వచ్చే ఆదాయం రూ. 29,041 కోట్లు. ద్రవ్యలోటు అంచనా రూ. 29,077 కోట్లు. రెవెన్యూ మిగులు అంచనా రూ. 5,520 కోట్లు. జీడీపీలో ద్రవ్యలోటు 3.45 శాతం.

✣ నీటిపారుదల రంగానికి రూ. 25 వేల కోట్లు, విద్యుత్‌శాఖకు రూ. 5,650 కోట్లు. విద్యాశాఖకు రూ. 10,830 కోట్లు, గురుకుల పాఠశాలలకు రూ. 2,828 కోట్లు, మహిళా శిశు సంక్షేమానికి, రూ. 1799 కోట్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు రూ. 2,643 కోట్లు, పంటల పెట్టుబడి మద్దతు పథకానికి రూ. 12 వేల కోట్లు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ. 15,563 కోట్లు, పరిశ్రమల రంగానికి రూ. 1286 కోట్లు, బీసీ సంక్షేమానికి రూ. 5,920 కోట్లు, ఎస్సీ సంక్షేమానికి రూ. 12,603 కోట్లు, ఎస్టీ సంక్షేమానికి రూ. 8,063 కోట్లు, మైనార్టీల సంక్షేమానికి రూ. 2,000 కోట్లు కేటాయించారు.

## ట్రంప్ విదేశాంగశాఖ మంత్రిగా మైక్ సాంపియో

✣ 2018, మార్చి 13న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విదేశాంగ శాఖ మంత్రి అయిన రెక్స్ టిల్లర్‌సన్‌ను పదవి నుంచి తొలగించారు. టిల్లర్‌సన్ స్థానంలో అమెరికా గూఢచర్య సంస్థ సీఐఏ డైరెక్టర్ మైక్ సాంపియోను ఎంపిక చేశారు. సీఐఏలో డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న గినా హాస్పెల్‌ను ఆ సంస్థకు కొత్త అధిపతిగా ట్రంప్ ఎంపిక చేశారు. ఈ పదవిలో ఒక మహిళను నియమించడం ఇదే మొదటిసారి.

**రచయిత: సీహెచ్. కృష్ణప్రసాద్**